

స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడిగా గన్నోజు మోహనాచారి ఎన్నిక

- రెండోసారి అధ్యక్ష పీఠంపై మోహనాచారి

- సంఘం అభివృద్ధికి కృషి చేస్తా: మోహనాచారి

వనపర్తి, నవంబరు 4 (ప్రజాజ్యోతి):

వనపర్తి పట్టణ స్వర్ణకారుల సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా గన్నోజు మోహనాచారి రెండోసారి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పి. నవీనాచారి ఎన్నికయ్యారు.

మిగతా 2 లో



గురువారం 05 నవంబర్ 2026 పేజీలు:13

సోషల్ మీడియా మాయలో పడొద్దు..

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దు!





- మహిళా విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి.. ఆన్‌లైన్ వేధింపులపై భయ పడకుండా ఫిర్యాదు చేయాలి- సైబర్ మోసానికి గురైతే 1930కు కాల్ చేయండి -- జిల్లా ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, నవంబర్ 4 (ప్రజా జ్యోతి బ్యూరో):

డిజిటల్ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతగా విస్తరిస్తోందో.. అదే స్థాయిలో సైబర్ నేరగాళ్ల మోసాలు కూడా పెరుగుతున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా పరిచయాలు పెంచుకుని, స్నేహం పేరుతో నమ్మకం కలిగించి మహిళా విద్యార్థినులను లక్ష్యంగా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి, ఐపీఎస్ సూచించారు.

మిగతా 2 లో

మాటలకే పరిమితం కాని సేవ..

చేతల్లో చూపించిన ఉప్పల వెంకటేష్!

- దేవాలయాల నిర్మాణానికి సొంత నిధులు- ప్రమాద బాధిత జర్నలిస్టు పిల్లల చదువుకు ఆర్థిక భరోసా



కల్వకుర్తి, నవంబర్ 4 (ప్రజా జ్యోతి)

కల్వకుర్తి నియోజకవర్గంలో ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలుస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. బుధవారం కల్వకుర్తి మండలం, మున్సిపల్ పరిధిలో పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు భరోసా కల్పించారు.

మిగతా 2 లో



మాటలకే పరిమితం కాని సేవ.. చేతల్లో చూపించిన ఉప్పల వెంకటేష్!

మొదటిపేజీ తరువాయి



దేవాలయాల పునర్నిర్మాణానికి సొంత నిధులతో సహకారం

కల్వకుర్తి మండలం ఎల్లికట్ట గ్రామంలో హనుమాన్, శివాలయం, చెన్నకేశవ స్వామి దేవాలయాల పునర్నిర్మాణ పనుల్లో భాగంగా పైకప్పు స్లాబ్ నిర్మాణానికి తన సొంత నిధులతో సహకారం అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఉప్పల వెంకటేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జర్నలిస్టు కుటుంబానికి అండగా.. పిల్లల చదువుకు భరోసా

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కల్వకుర్తికి చెందిన జర్నలిస్టు శేఖర్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆపద సమయంలో జర్నలిస్టు కుటుంబానికి అండగా నిలుస్తూ, ఈ విద్యా సంవత్సరంలో ఆయన ఇద్దరు పిల్లల పాఠశాల ఫీజులను తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. దీంతో జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారు.



పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక పరిశీలన

ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నిర్వహిస్తున్న ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శించి నమోదు ప్రక్రియను పరిశీలించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అర్హులైన పట్టభద్రులు ఇంకా ఎవరైనా ఓటరుగా నమోదు చేసుకోకపోతే వెంటనే నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, మధు, సూర్య ప్రకాష్ రావు, మనోహర్ రెడ్డి, మార్చల సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి, భీమయ్య, ప్రసాద్, దారమని గణేష్, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, ఉప్పల వెంకటేష్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా మాయలో పడొద్దు.. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దు!

మొదటిపేజీ తరువాయి

సైబర్ జాగృతి దివస్ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుమారు 2,300 మంది విద్యార్థినులకు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు యువతులను లక్ష్యంగా చేసుకుని నకిలీ సోషల్ మీడియా ఖాతాల ద్వారా పరిచయాలు పెంచుకుంటున్నారని, ప్రేమ, స్నేహం పేరుతో నమ్మకం సంపాదించి వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు, ఇతర వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు. అనంతరం వాటిని మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతామని బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు వసూలు చేయడం వంటి నేరాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. వీడియో కాల్స్ ద్వారా బ్లాక్‌మెయిల్, నకిలీ ఉద్యోగ ప్రకటనలు, ఆన్‌లైన్ గేమ్స్, ఫేక్ లింకులు వంటి మోసపూరిత పద్ధతుల పట్ల కూడా విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు, ఫోన్ నంబర్లు, చిరునామా వంటి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అందించకూడదన్నారు. సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు, టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, ఎవరితోనూ ఓటీపీ, బ్యాంకు వివరాలు, యూపీఐ పిన్ పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా ఆన్‌లైన్‌లో బెదిరింపులకు పాల్పడినా, అసభ్యకర సందేశాలు పంపినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని స్పష్టం చేశారు.



మోసపోయిన వెంటనే స్పందించండి.. 1930కు ఫోన్ చేయండి!

సైబర్ ఆర్థిక మోసాలకు గురైనప్పుడు మొదటి గంట అత్యంత కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. మోసం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే ఎఽఽష.ఎఎఎవతీఎతీఅఎవ.స్వ్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సత్వర ఫిర్యాదు ద్వారా మోసగాళ్ల ఖాతాల్లోకి వెళ్లిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని వివరించారు. అనంతరం విద్యార్థినులకు సైబర్ నేరాల రకాలు, వాటి నివారణ చర్యలు, మోసాలకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పోస్టర్ల ద్వారా వివరించారు. తాము తెలుసుకున్న విషయాలను కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా తెలియజేసి సైబర్ నేరాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరికుమార్, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్, పోలీస్ అధికారులు, సిబ్బంది, సుమారు 2,300 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడిగా గన్నోజు మోహనాచారి ఎన్నిక

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల అధికారులుగా శ్యామ్‌సుందర్, మాధవాచారి వ్యవహరించి ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మోహన్, నారాయణదాస్ అనిల్, కృష్ణయ్య, కంసలి నాగార్జున్ తదితరులు పోటీ చేశారు. ఈ సందర్భంగా మోహనాచారి మాట్లాడుతూ.. స్వర్ణకారుల సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు సభ్యులందరి సహకారంతో ముందుకు సాగుతానని తెలిపారు.



అఖిలభారత 36వ మహాసభలను జయప్రదం చేయండి

– రైతంగ సాయుధ పోరాట గడ్డ నల్లగొండలో

జరుగుతున్న రైతు మహాసభలను జయప్రదం చేయండి



నాగర్ కర్నూల్ నవంబర్ 4

(ప్రజా జ్యోతి బ్యూరో)

నాటి బ్రిటిష్ సామ్రాజ్యవాదం, వలసవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో 1936లో అఖిలభారత కిసాన్ సభ ఆవిర్భవించి నేటికీ 90 సంవత్సరాలు అవుతున్నది. ప్రపంచ గుర్తింపు పొందిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల పురిటిగడ్డ నల్లగొండలో మొట్ట మొదటిసారిగా అఖిలభారత కిసాన్ సభ 36వ రైతు జాతీయ మహాసభలుజరుగుతున్నాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దేశనాయక్ అన్నారు. ఈ మహాసభలను రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బల్మూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద రైతు సంఘం అఖిలభారత మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నాగర్ కర్నూల్ జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని ఇప్పటికి 13 మండలాలకి కరువు మండలాలు ప్రకటించి మిగతా మండలాలను ప్రకటించలేదని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు, ప్రకటించిన కరువు మండలాల్లో ఆరధాన్యాలకు ఎకరాకు 25 వేల చొప్పున వాణిజ్య పంటలు పత్తి వంటికి ఎగరకు 50 వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీడు భూములకు సాగునీరు, అందించే ప్రాజెక్టుల కోసం, పోడు భూములకు పట్టాలు, కౌలు రైతులకు న్యాయంచేయాలని ,పంట రుణాలు, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సరఫరా, నేటికీ రుణమాఫీ అమలు కానీ రైతులకు వెంటనే చేయాలని పెండింగ్ రైతు భరోసా నిధులనుఇవ్వాలని ,వరంగల్ రైతు డిక్లరేషన్లు కాంగ్రెస్ ప్రకటించిన వాగ్దానాలు అమలుకై చర్యలు చేపట్టాలని ప్రేమిస్తే అనేక ఆందోళన పోరాటాలకు పునాది వేస్తామని వారు అన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను స్థాపించాలని డిమాండ్ చేశారు. నేడు రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కారానికి ఈ సమస్యల ఆందోళన పోరాటాల కార్యక్రమంలో నల్గొండలో జరిగే ఏఐకేఎస్ 36 అఖిల భారత మహాసభ వేదిక కాన ఉందని ఈ మహాసభ విజయవంతం కావడానికి రైతులు రైతు శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శంకర్ నాయక్ మండల నాయకులు బాలరాజు కృష్ణయ్య భారీమం ఆంజనేయులు రాయుడు లాలు కృష్ణగన్న నారాయణ రైతులు తదితరులు ఉన్నారు,

మొల్ల మాంబ కీర్తిని చాటుదాం..

ఐక్యతను చూపుదాం

- కుమ్మరుల ఐక్యతకు మొల్ల మాంబ విగ్రహ భూమిపూజ వేదిక

- నవంబర్ 11న మొల్ల మాంబ విగ్రహానికి భూమిపూజ

వనపర్తి, నవంబరు 4 (ప్రజాజ్యోతి):

తొలి తెలుగు కవయిత్రిగా పేరొందిన ఆతుకూరి మొల్లమాంబ తెలుగుజాతి గర్వించదగ్గ మహా రచయిత్రి అని మాజీ కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ బొడ్డుపల్లి పరుశురాం, శ్రీరంగాపురం కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు గోవిందు అన్నారు. బుధవారం శ్రీరంగాపురం మండలంలో కుమ్మరి సంఘం అధ్యక్షులు, యువజన నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నవంబర్ 11న వనపర్తి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేతుల మీదుగా మొల్లమాంబ విగ్రహ భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నన్నయ్య ఆదికవి అయితే, మొల్ల ఆదికవయిత్రిగా తెలుగు సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. రాజుల ఆస్థానాల అండ లేకుండానే సామాన్యులకు సైతం అర్థమయ్యే అచ్చ తెలుగులో రామాయణాన్ని రచించి శ్రీరాముడికి అంకితం చేసిన గొప్ప కవయిత్రి మొల్ల అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మొల్లమాంబ విగ్రహ భూమిపూజ కార్యక్రమానికి వనపర్తి జిల్లా పరిధిలోని కుమ్మర కుటుంబాల సభ్యులు, కుల పెద్దలు, యువత, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం, ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బొడ్డుపల్లి మన్యం, మండల సంఘం అధ్యక్షుడు శేఖర్, ఉపాధ్యక్షుడు ఎల్లస్వామి, యువజన అధ్యక్షుడు సురేష్, శ్రీరంగాపురం టౌన్ అధ్యక్షుడు తిరుపతయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనుల నిర్వహణలో మేట్లదే కీలక బాధ్యత!

– మేట్లకు ప్రత్యేక శిక్షణ.. పనుల నిర్వహణ,

హాజరు నమోదు పారదర్శకతపై ఏపీఓ ధనుంజయ రాజు అవగాహన

చిన్నంబావి, నవంబర్ 04 (ప్రజాజ్యోతి)

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకం పనులను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు కూలీలకు నిరంతరం పని కల్పించడంలో మేట్లు కీలక పాత్ర పోషించాలని ఏపీఓ ధనుంజయ రాజు సూచించారు. చిన్నంబావి మండల పరిధిలోని దగడపల్లి రైతు వేదికలో ఉపాధి హామీ పథకం కింద వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న మేట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టే పనుల నిర్వహణ, కూలీలకు పని కల్పించే విధానం, పని ప్రదేశాల్లో హాజరు నమోదు, రోజువారీ పనుల వివరాల నమోదు, పనుల కొలతలు, కూలీలకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్ గౌడ్ మేట్ల విధులు, బాధ్యతలు, పథకం కింద చేపట్టే 375 రకాల పనులపై అవగాహన కల్పించారు. పనుల్లో నాణ్యత, పారదర్శకత పాటించాలని సూచించారు. అనంతరం ఏపీఓ ధనుంజయ రాజు మేట్లకు వివరంగా అవగాహన కల్పించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాల్సిన విధానాన్ని వివరించారు.ఈ సందర్భంగా ఏపీఓ ధనుంజయ రాజు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంత పేద కూలీలకు జీవనోపాధి కల్పించే ముఖ్యమైన పథకమని పేర్కొన్నారు. ఈ పథకం లక్ష్యాలు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలయ్యేలా మేట్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.గ్రామాల్లో అందుబాటులో ఉన్న కూలీలకు ముందుగానే పనుల వివరాలు తెలియజేసి, పనులకు హాజరయ్యేలా సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పని ప్రదేశాల్లో కూలీల హాజరును నిబంధనల ప్రకారం నమోదు చేయడంతో పాటు, రోజువారీ పనుల వివరాలు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. పనుల కొలతలు, కూలీల పని సామర్థ్యం, వారికి అందించాల్సిన సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. పనుల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించాలని, కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి మేటు తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, ఉపాధి హామీ పనుల అమలులో అధికారులకు మరియు కూలీలకు మధ్య సమన్వయకర్తగా వ్యవహరించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి పథకం విజయవంతానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఈసీ వెంకటేశ్వర్లు,టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ) మేకల గోపాల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కత్తి కురుమూర్తి, భాస్కర్ నాయక్, రామకృష్ణ, భాస్కర్ నాయుడు, భారతి, అరుణ, విష్ణు, మేట్లు అనుకలి అంజలమ్మ, సీతామాలక్ష్మి, శ్రీనివాసులు, మాధవి,మధుసూదన్, మద్దూరి రాజు, వెంకటేష్, రాజశేఖర్, అంజతొద్దిన్, గ్రామాల మెట్లు తదితరులు పాల్గొన్నారు.



రైతు బాగుపడితే నే రాష్ట్రం, దేశం బాగుపడుతుంది

- ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలి

- నారాయణపేట జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు వెంకట్రాములు ముదిరాజ్

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి,నవంబర్ 04 (ప్రజా జ్యోతి):



రైతు బాగుపడితేనే రాష్ట్రం బాగుపడు తుంది. రైతులకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీల కంటే రైతు తను పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర వస్తేనే రైతు లాభపడతాడని కిసాన్ మోర్చా నారాయణపేట జిల్లా అధ్యక్షులు వెంకట్రాములు ముదిరాజ్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బలరామిరెడ్డి, ఉపాధ్యక్షులు కర్నె స్వామి అన్నారు. రైతు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి తప్ప వారికి గిట్టుబాటు ధర లభిస్తుంటే అడ్డుకోవడం మంచిది కాదన్నారు. ఎల్ ని నో ప్రభావం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, కొంతమంది రైతులు తాము పండించిన ధాన్యాన్ని నేరుగా వ్యాపారులకు అమ్ముకుని గిట్టుబాటు ధర పొందుతుంటే ప్రభుత్వానికి ఎందుకు కడుపు మంట అని ప్రశ్నించారు. కల్లాల వద్దకే వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేయడం ద్వారా రైతులకు మార్కెట్లో విధించే ఖర్చులన్నీ తప్పి క్వింటాలకు 4 వేల రూపాయల నుండి 5 వేల రూపాయల వరకు ధర రావడం వల్ల రైతుకు మేలు జరుగుతోందని, మార్కెట్ ఖర్చులన్నీ తొలగిపోయి రైతులకు ఎంతో కొంత లాభం జరుగుతోందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం వ్యాపారస్తులను బెదిరించడం సమంజసం కాదన్నారు. రైతు ప్రయోజనాల కంటే రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్న వ్యాపారులపై దాడులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమా అని ప్రశ్నించారు. రైతులు ఎన్నో కష్టాలు నష్టాలను ఎదుర్కొని పంట పండిస్తారన్నారు. గతంలో అనేక రకాల పంటలు సాగు చేసి నష్టపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని చివరకు పండించిన పంటకు గిట్టుబాటు ధర వస్తుందో రాదో తెలియని పరిస్థితి రైతులది అని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం వరి ధాన్యానికి కొంతమేర మంచి ధర లభిస్తుందడంతో మిల్లర్లు ధాన్యం వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నారని, ఈ విధంగా రైతులకు గిట్టుబాటు ధర తీస్తుందన్నారు. దీంతో రైతుల్లో కొంత ఆశ చిగురించిందన్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత తమ కష్టానికి తగిన ప్రకటన దక్కుతుందనే ఆశ తో రైతులు సంతోషపడుతున్నారన్నారు. కానీ ఇలాంటి సమయంలో ప్రభుత్వం మిల్లర్లు,బియ్యం వ్యాపారులపై తనిఖీలు దాడులు నిర్వహిస్తూ డిఎం కిచరయ్య ధరలపై విధిస్తున్నట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ చర్యల ప్రభావం ధాన్యం కొనుగోళ్లపై పడితే చివరకు నష్టపోయేది వ్యాపారులు కాదు రైతులే కదా అన్నారు. ఈ పరిణామాల రేపు ధాన్యం ధరలు తగ్గుముఖం పడుతున్నాయని ఆందోళన రైతుల్లో వ్యక్తం అవుతుందని వెంకట్రాములు అన్నారు. రైతులకు రుణమాఫీ బోనస్లను ఇతర పథకాలు ప్రకటించడం కంటే రైతు పండించిన పంటకు మార్కెట్లో మంచి ధర లభించేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలని వెంకట్ రాములు అన్నారు. రైతులకు కొద్దిపాటి గిట్టుబాటు ధర వస్తున్న సమయంలో ఆ ధర నిలకడగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సింది పోయి కొనుగోలు వ్యవస్థపై ప్రభావం చూపే చర్యలు తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రస్తుతం వర్షాలు లేక పోవడం మూలంగా ప్రాజెక్టులు చెరువులు కుంటలలో నీరు లేకపోవడం ఏ కాకుండా భూగర్భ జలాలు కూడా అంతరించిపోయాయి. అప్రకటిత విద్యుత్ కోతల మూలంగా బోరు బావులలో ఉన్న నీరు కూడా పంట పొలాలకు పెట్టలేకపోయి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీని కారణంగా పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర కన్నా ఎక్కువ ధరను చెల్లించి రైతుల దగ్గరికి పక్క రాష్ట్రాల వ్యాపారస్తులు వచ్చి న్యాయమైన ధరలు చెల్లించి వడ్లు కొనుగోలు చేస్తూ ఉంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తెచ్చి పక్క రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారస్తులపై ఒత్తిడి తెచ్చి ధరలు తగ్గించమని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనమని వారిపై ఒత్తిడి చేస్తున్నారు. అసలే వర్షాలు లేక పంటలు ఎండిపోయి దిక్కుతోచనే స్థితిలో ఉన్న రైతులకు పక్క రాష్ట్రాల వ్యాపారస్తులు ధాన్యాన్ని కొనుగోలు చేయడం మూలంగా మంచి ధర వస్తుంటే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రైతుల తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా బక్క రాష్ట్రాల వ్యాపారస్తులు రాకపోవడం వల్ల ధాన్యం ధర పూర్తిగా తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన అన్నారు. ఇలాగే అధికారులు వ్యాపారస్తు లను వేధిస్తే రైతులకు మద్దతుగా భారతీయ జనతా పార్టీ తరపున ,కిసాన్ మోర్చా తరపున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బిజెపి నారాయణపేట జిల్లా కార్యదర్శి కనకరాజు, మైనారిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జావీద్ హుస్సేన్, ఓబీసీ మోర్చా నాయకులు సత్యనారాయణ లు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలి అదనపు కలెక్టర్ మధుమోహన్

గద్వాల నవంబర్ 04 ప్రజా జ్యోతి ప్రతినిధి):





ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే పనులను ఎలాంటి వివాదాలకు తావులేకుండా, పార దర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మధు మోహన్ అధికారులను ఆదే శించారు. మల్దకల్ మండలంలోని బూడిదపాడు గ్రామంలో కొన సాగుతున్న రీసర్వే పనులను బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్న తీరును, సంబంధిత రికార్డులను పరిశీలించి, పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, సమన్వయంతో నిర్వహిస్తూ నిర్దేశిత లక్ష్యాల మేరకు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రీసర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలి పారు. సర్వే పనుల్లో లైసెన్స్డ్ సర్వేయర్ల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు.ఈ పర్యటనలో సర్వే ఏడీ నూకరాజు, మల్దకల్ తహసీల్దార్ ఝాన్సీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలి

- నాగర్ కర్నూల్ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ కోరే రెనయ్య

నాగర్ కర్నూల్ నవంబర్ 4 (ప్రజా జ్యోతి బ్యూరో)

హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కొరకు అర్హత కలిగిన ప్రతి ఒక్క పట్టబద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఓటర్లకుకోరే రెన్నయ్య విజ్ఞప్తి చేశారు.ఈనెల 6 వ తేదీ ఓటర్ నమోదుకు చివరి రోజున ఉన్నందున ఈ యొక్క అవకాశాన్ని అర్హత కలిగిన పట్టభద్రులుసద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



కమిషన్ల కక్కతితో పాతర్చెడ్ గ్రామ పత్తి మిల్లు పై బిఆర్ఎస్ ఆందోళన

తూకాల్లో ఎలాంటి మోసాలు జరగలేదు

కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బిసం చెన్నయ్య సాగర్.

నర్వ నవంబరు 4 ప్రజాజ్యోతి



కమిషన్ల కక్కృతి కోసమే పాతర చెడు పత్తి మిల్లు పై టిఆర్ఎస్ నాయకులు పనిగట్టుకొని పాతర చెడు గ్రామ పత్తి మిల్లు ను ముట్టడించి ఆందోళనలు చేయడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు బి.సమ్ చెన్నయ్య సాగర్ అన్నారు, బుధవారం నర్వ ఎంపీడీవో కార్యాలయం వద్ద ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రసిడింగులను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు, ఈ ప్రాంత రైతాంగాశీ మేలుకోరి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చ పెట్టుబడులు పెట్టి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేస్తే ఓర్వలేని విఆర్ఎస్ నాయకులు కావాలని తూకాల్లో మోసాలు జరుగుతున్నాయని నిందలు వేస్తూ ప్రచారాలు చేయడం ఎంతవరకు సమంజసం అని తీవ్రంగా ఖండిస్తూ అన్నారు,, పత్తి నాణ్యతని బట్టి మైచర్ ద్వారా ధరలు నిర్ణయించి పత్తిని కొనుగోలు చేస్తున్న మిల్లు యజమానులను. అనవసరంగా మిల్లు ప్రారంభ దశలోనే మిల్లు యజమానులను బెదిరింపులకు గురి చేస్తూ రైతుల పక్షాన మేము మాట్లాడుతున్న అనడం ఎంతవరకు సమంజసం మన్నారు, టిఆర్ఎస్ పదేళ్ల కాలంలో ఎక్కడైనా ఎలాంటి కంపెనీలు పత్తి మిల్లులు నిర్మాణం జరిగిందా ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోవాలని ఎద్దేవా చేశారు, ప్రస్తుతం రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అన్నగారి కృషితో ఈ ప్రాంతంలో అక్కడక్కడ రైస్ మిల్లులు, పత్తి మిల్లులు పడటం ద్వారా ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుంది ఇది టిఆర్ఎస్ నాయకులు గుర్తించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెటింగ్ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ జిల్లా పార్టీ నాయకులు వివేకవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, మానసిక వికాసాన్ని పెంపొందించాలి

- పీఎం శ్రీ పాఠశాలను సందర్శించిన ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ రాధాకృష్ణ







మల్దకల్ నవంబర్ 04(ప్రజా జ్యోతి ప్రతినిధి):

తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మానిటరింగ్ బై ఎమినెంట్ ఎక్స్‌పర్ట్స్'కార్యక్రమంలో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మహబూబ్‌నగర్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ రాధాకృష్ణ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి అభ్యసన స్థాయిలు,విషయ పరిజ్ఞానం,ఆలోచనా విధానం, చదువుపై ఆసక్తిని పరిశీలించారు.విద్యార్థుల్లో మానసిక వికాసం, ఆత్మవిశ్వాసం,సృజనాత్మక ఆలోచనా శక్తిని పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.చదువు ప్రాముఖ్యత, సమర్థవంతంగా చదివే పద్ధతులు,విద్యార్థుల్లో కనిపించే విభిన్న అభ్యసన సామర్థ్యాలు,భిన్న మనస్తత్వాలు తదితర అంశాలపై ఆయన విలువైన సూచనలు చేశారు.ప్రతి విద్యార్థిలోని ప్రత్యేక సామర్థ్యాన్ని గుర్తించి,వారి అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన అందించినప్పుడే ఆశించిన విద్యా ఫలితాలు సాధ్యమవుతాయని వివరించారు.విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి జి.సురేష్ మాట్లాడుతూ,ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ రాధాకృష్ణ అందించిన సూచనలు విద్యార్థుల మానసిక వికాసంతో పాటు సర్వతోముఖ అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు యు.రాజేశ్వర్ రెడ్డి,ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

కల్వకుర్తి సింగిల్ విండో పీఠంపై పురం హరీష్ రెడ్డి

రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన నూతన చైర్మన్

కల్వకుర్తి,నవంబర్ 4 (ప్రజా జ్యోతి):



కల్వకుర్తి సింగిల్ విండో సహకార సంఘం చైర్మన్‌గా రఘుపతిపేట గ్రామానికి చెందిన పురం హరీష్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలకమైన బాధ్యతను అప్పగించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి, కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన చైర్మన్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హరీష్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు.సింగిల్ విండో ద్వారా రైతులకు అందించే సేవలను మరింత మెరుగుపరిచి, వారికి అవసరమైన రుణాలు, ఇతర సహకార సేవలు సకాలంలో అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ, సహకార సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

తండావాసులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేత

నర్వ నవంబరు 4 ప్రజాజ్యోతి

నారాయణపేట జిల్లా ఉమ్మడి నర్వ మండల పరిధిలోని బుడ్డగాన్ తండా గిరిజన వాసులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయి, లబ్ధిదారులకు బుధవారం నర్వ ఎంపీడీవో కార్యాలయం వద్ద, ఎంపీ ఓ రాఘవేందర్. ఎంపీడీవో శ్రీనివాసులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు, ఈ సందర్భంగా ఎంపీ ఓ రాఘవేందర్మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు, మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు నెలలోపు పనులను ప్రారంభించాలని ఆదేశించారు, లేనియెడల రిజెక్ట్ అవుతాయని సూచించారు, నిబంధనల పద్ధతిలో ఇండ్లు నిర్మించుకున్న వెనువెంటనే బిల్లులు మంజీర అవుతాయని తెలిపారు, ఈ తండా వాసులకు ఇంతవరకు 15 ఇండ్లు ప్రస్తుతం 10 ఇండ్లు మొత్తం 25 ఇండ్లు వరకు కూడా మంజూరు కావడం జరిగింది అన్నారు, ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, డి కృష్ణారెడ్డి, వివేకవర్ధన్ రెడ్డి, అంజి రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు శేఖర్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అరుణజ్యోతిపై దాడికి పాల్పడిన లక్ష్మణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి..

మత సామరస్యాన్ని కాపాడాలి: రెవ. డాక్టర్ ఎస్. వరప్రసాద్

మహబూబ్‌నగర్ నవంబర్ 04 (ప్రజా జ్యోతి బ్యూరో):

దేవుడిని విశ్వసించడం, ప్రార్థనలు చేసుకోవడం, తమ మత విశ్వాసాలను స్వేచ్ఛగా వ్యక్తపరచడం ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు. అయితే క్రైస్తవులు తమ విశ్వాసాలను ఆచరిస్తున్న సందర్భాల్లో దాడులకు పాల్పడటం, భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని మహబూబ్‌నగర్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. మత విశ్వాసాల పేరుతో దాడులకు పాల్పడే చర్యలను తీవ్రంగా ఖండించారు.ఇటీవల అల్మాస్ గుడలో అరుణజ్యోతి అనే యువతిపై లక్ష్మణ్ అనే వ్యక్తి చేయి చేసుకున్న ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక యువతి తనకున్న మత విశ్వాసాన్ని వ్యక్తపరచడమే తప్పా? ప్రార్థనలు చేసుకునే స్వేచ్ఛ కూడా లేకుండా పోతోందా? అంటూ వారు ప్రశ్నించారు.మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాస్టర్స్ ఫెలోషిప్ చీఫ్ ప్యాట్రన్ రెవ. డాక్టర్ ఎస్. వరప్రసాద్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛను కల్పించిందని, ఇతరుల మత విశ్వాసాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. క్రైస్తవులపై దాడులు, బెదిరింపులు, వేధింపులకు పాల్పడే వారిపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

మత సామరస్యమే దేశానికి బలం!

భారతదేశం భిన్న మతాలు, భిన్న సంస్కృతులకు నిలయమని, ఇక్కడ ప్రతి ఒక్కరికీ తమ మతాన్ని ఆచరించే హక్కు ఉందని నాయకులు పేర్కొన్నారు. ఒకరి మత విశ్వాసాలను మరొకరు గౌరవించుకున్నప్పుడే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పరిఢవిల్లుతాయని తెలిపారు. క్రైస్తవులపై దాడులకు పాల్పడటం ద్వారా సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలను అరికట్టాలని కోరారు. అరుణజ్యోతి ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితురాలికి న్యాయం చేయడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నవంబర్ 10న క్రైస్తవుల ఐక్యతా పిలుపు

ఈ ఘటనకు నిరసనగా, క్రైస్తవుల మత స్వేచ్ఛ, హక్కుల పరిరక్షణ కోసం నవంబర్ 10, 2026 మంగళవారం క్రైస్తవులందరూ ఐక్యంగా



ముందుకు రావాలని పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు పిలుపునిచ్చారు. శాంతియుతంగా తమ నిరసనను తెలియజేస్తూ, న్యాయం కోసం సంఘటితంగా నిలబడాలని కోరారు.మత విశ్వాసం వ్యక్తిగత హక్కు.. దానిపై దాడి సమాజ సామరస్యానికి విఘాతం. ప్రతి ఒక్కరి హక్కులను గౌరవిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని నాయకులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బి.ఐ. జాకబ్ (వైస్ చైర్మన్), జె.ఐ. డేవిడ్, టి.ఎ. స్టీఫెన్ (కోశాధికారి), దాసరి శామ్యూల్ ప్రభాకర్ (క్రిస్టియన్ మైనారిటీ పట్టణ అధ్యక్షులు), కాశపోగు ప్రసాద్ (క్రిస్టియన్ జేఏసీ అధ్యక్షులు)తో పాటు పలువురు చర్చి కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
గురువారం 05 నవంబర్ 2026

జడ్చర్లలో తాగునీటి సమస్యకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు!

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

- పెండింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు

మహబూబ్ నగర్ నవంబర్ 04 (ప్రజా జ్యోతి బ్యూరో):

మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు చేపట్టిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పటికీ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌తో కలిసి వివిధ వార్డుల్లో పర్యటించిన అదనపు కలెక్టర్, తాగునీటి సరఫరా కోసం చేపట్టిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలించారు. పైప్‌లైన్లలో ఏర్పడిన లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టే పనుల పురోగతిని సమీక్షించారు. అదేవిధంగా నిరుప యోగంగా ఉన్న బోరుబావుల పునరుద్ధరణ, పాత తాగునీటి వనరులను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చే పనులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో సాంకేతిక కారణాలతో అంతరాయాలు ఏర్పడిన సందర్భాల్లో ప్రత్యామ్నాయ వనరుల ద్వారా ప్రజలకు నిరంతర తాగునీరు అందించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ స్పష్టం చేశారు.



మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి బృహత్ అవగాహన సదస్సు.!

- నేడు మహబూబ్‌నగర్‌లో ఉచిత మెడికల్ క్యాంప్.. 'స్పర్శ్' పెన్షన్ సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం

- మాజీ సైనికులు, వితంతువులు, కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి:

ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి ఏ. శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ నవంబర్ 04 (ప్రజా జ్యోతి బ్యూరో):

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మాజీ సైనికులు, వారి వితంతువులు, కుటుంబ సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా మహబూబ్ నగర్‌లో బృహత్ అవగాహన సదస్సుతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి ఏ. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నవంబర్ 6వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మహబూబ్‌నగర్ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని రాజబహదూర్ వి.ఆర్. రెడ్డి కమ్యూనిటీ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ సైనిక సంక్షేమ శాఖ సంచాలకులు బ్రిగేడియర్ ఎన్.ఆర్. బాబు (రిటైర్డ్) ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు గోల్కొండ ఆర్టిలరీ రికార్డ్స్ అధికారులు, వివిధ సైనిక రికార్డుల విభాగాలకు చెందిన జనరల్ ఆఫీసర్లు, సంబంధిత సిబ్బంది హాజరుకానున్నారు.

'స్పర్శ్' పెన్షన్ సమస్యలకు పరిష్కారం

మాజీ సైనికులకు పెన్షన్లకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలు, సందేహాలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు ఈ సదస్సు మంచి అవకాశంగా నిలవనుంది. ముఖ్యంగా 'స్పర్శ్' పెన్షన్ విధానంలో ఎదురవుతున్న సమస్యలపై అధికారులు అవగాహన కల్పించడంతో పాటు పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు.

ఉచిత వైద్య పరీక్షలు.. వైద్యుల సలహాలు

ఈ కార్యక్రమంలో భాగంగా హాజరయ్యే మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించనున్నారు. మాజీ సైనికుల ఆరోగ్య సంరక్షణకు ఈ వైద్య శిబిరం దోహదపడనుంది.

కలెక్టర్, ఎస్పీ ముఖ్య అతిథులు

ఈ అవగాహన సదస్సుకు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ దరావత్ జానకి, ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన మాజీ సైనికులు, వారి వితంతువులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి ఏ. శ్రీనివాస్ రెడ్డి కోరారు. దేశ రక్షణ కోసం సేవలందించిన మాజీ సైనికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ఈ సదస్సు ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీకి సన్నాహాలు వేగవంతం చేయాలి.!

- గృహ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనపై అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష

- పెండింగ్ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు

మహబూబ్‌నగర్, నవంబర్ 4 (ప్రజా జ్యోతి బ్యూరో):

జిల్లాలో లబ్ధిదారులకు పంపిణీ చేయనున్న డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.బుధవారం ఈ మేరకు వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో డబుల్ బెడ్ రూం గృహ సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన పనుల పురోగతి, ప్రస్తుత స్థితిగతులపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. గృహ సముదాయాల్లో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి సరఫరా, అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలన్నారు.ఇప్పటివరకు పూర్తయిన పనులు, పురోగతిలో ఉన్న పనులు, ఇంకా ప్రారంభించాల్సిన పనులతో పాటు పనుల పూర్తికి దురవుతున్న సమస్యలపై అధికారులను అడిగి



వివరాలు తెలుసుకున్నారు. గృహాల పంపిణీ సమయానికి అన్ని రకాల మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి వేగవంతం చేయాలని, పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ వంటి ప్రాథమిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.లబ్ధిదారులకు ఇళ్లు అందించడమే కాకుండా, వారు గృహప్రవేశం చేసిన నాటి నుంచే అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ ఉపేందర్ రెడ్డి, పిడి హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, మిషన్ భగీరథ ఈఈలు, డీఈఈలు, ఏఈలు, పబ్లిక్ హెల్త్ ఈఈ, విద్యుత్ శాఖ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 15 నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో పేపర్‌లెస్ పాలన!

- డిజిటల్ సేవల అమలుకు ఉద్యోగులకు మూడు రోజుల ప్రత్యేక శిక్షణ

- పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడమే లక్ష్యం: డీఆర్ఓ ఎ. నిర్మల



మహబూబ్‌నగర్, నవంబర్ 4 (ప్రజా జ్యోతి బ్యూరో):

ప్రభుత్వ కార్యాలయాల పనితీరులో పారదర్శకతను పెంపొందించడంతో పాటు ఉద్యోగుల సామర్థ్యాన్ని మెరుగుపరిచి, పేపర్‌లెస్ పాలనను అమలు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ విధానాలకు శ్రీకారం చుట్టిందని జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల



తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాల డిజిటలైజేషన్‌లో భాగంగా నవంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉద్యోగుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె ప్రారంభించారు. ఈ శిక్షణలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులకు డిజిటల్ మాడ్యూల్స్‌పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీఆర్ఓ ఎ. నిర్మల మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ డిజిటల్ విధానాలపై శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. నవంబర్ 15వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వ శాఖల్లో పేపర్‌లెస్ విధానం అమల్లోకి రానున్న నేపథ్యంలో ఉద్యోగులందరూ డిజిటల్ వ్యవస్థపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.గతంలో ఒక కార్యాలయం నుంచి మరో

కార్యాలయానికి ఫైళ్లను కాగితాల రూపంలో పంపించాల్సి వచ్చేదని, ప్రస్తుతం డిజిటల్ విధానం ద్వారా ఉద్యోగులు తమ కార్యాలయాల్లోనే ఉండి ఫైళ్లను ఆన్‌లైన్‌లో పంపించుకోవచ్చని వివరించారు. అంతేకాకుండా దరఖాస్తులు, ఫైళ్ల ప్రస్తుత స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ శాఖ విధులు, అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక డిజిటల్ మాడ్యూల్స్ రూపొందించినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో పంచనామాలు, మరణ ధ్రువీకరణ పత్రాలు తదితర సేవలకు సంబంధించిన ప్రక్రియలను డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఇంజినీరింగ్‌తో పాటు ఇతర శాఖలకు సంబంధించిన కార్యకలాపాలను కూడా ఆయా శాఖల పరిధిలోనే ఆన్‌లైన్ ద్వారా నిర్వహించేలా వ్యవస్థను రూపొందించారని వివరించారు.డిజిటల్ విధానం అమలుతో ఫైళ్ల కదలిక వేగవంతం కావడంతో పాటు పనుల్లో జాప్యాన్ని తగ్గించవచ్చని, పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని అన్నారు. ఉద్యోగులందరూ మూడు రోజుల శిక్షణను సద్వినియోగం చేసుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి, జిల్లా ట్రెజరీ అధికారి బి. శ్రీనివాస్, పీఏఓ వి.ఎస్. చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..
పారిశుధ్యం, విద్య, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి!

- పోమాల్, తిమ్మాయపల్లిలో క్షేత్రస్థాయి పరిశీలన.. అధికారులకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాలు

- మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోని అంగన్‌వాడీ భవనం..

పోషకాహార సరఫరాలోనూ అంతరాయం.. అధికారులపై కలెక్టర్ ఆరా









మహబూబ్‌నగర్, నవంబర్ 4 (ప్రజా జ్యోతి బ్యూరో):

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందించడంతో పాటు పారిశుధ్య నిర్వహణను పటిష్టం చేయడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నవాబ్‌పేట మండలంలోని పోమాల్, తిమ్మాయపల్లి గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఆమె ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, గ్రామ పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పోమాల్ గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై గ్రామస్థులను నేరుగా అడిగి తెలుసుకోగా, పనులు సక్రమంగా జరగడం లేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే స్పందించిన కలెక్టర్ గ్రామంలో పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలించారు. రెండో తరగతి విద్యార్థులకు బోర్డుపై రాసిన తెలుగు అక్షరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఓ విద్యార్థినికి అక్షరాలు సరిగా కనిపించకపోవడాన్ని గుర్తించి వెంటనే కంటి పరీక్షలు నిర్వహించాలని, అవసరమైతే ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం ద్వారా పరీక్షలు చేయించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రధానోపాధ్యాయుడికి ఆదేశించారు. గ్రామంలో తాగునీటి పైపులైన్ లీకేజీని గుర్తించిన కలెక్టర్ నీటి వృథాపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని, పైపులైన్ లీకేజీలను తక్షణమే అరికట్టాలని అధికారులకు సూచించారు.ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్ అవసరమైన మౌలిక వసతులను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య సేవలు, మందుల లభ్యత, టీకాల కార్యక్రమంపై రోగులు, గర్భిణులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఐదు గ్రామాలకు సేవలందిస్తున్న ఈ ఉపకేంద్రంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు.

మూడేళ్లుగా భవనం సిద్ధమైనా.. ప్రారంభమెప్పుడు?

పోమాల్ గ్రామంలోని గడ్డ కాలనీలో మూడేళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ భవనం ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదని గ్రామ సర్పంచ్ కలెక్టర్ దృష్టికి తీసుకురావడం ఈ పర్యటనలో ప్రత్యేకంగా నిలిచింది. దీనిపై స్పందించిన కలెక్టర్ జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగంతో ఫోన్‌లో మాట్లాడి భవనం ప్రారంభానికి నోచుకోకపోవడానికి గల కారణాలను ఆరా తీశారు. అవసరమైన చర్యలు చేపట్టి భవనాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.తిమ్మాయపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను పరిశీలించారు. పిల్లల బరువును స్వయంగా తనిఖీ చేసి కేంద్రంలో అందుబాటులో ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. పప్పులు, ఆకుకూరలు, గుడ్లు తదితర పోషకాహార పదార్థాల సరఫరా నిలిచిపోయిందని సిబ్బంది తెలపడంతో సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కారణాలు తెలుసుకున్నారు. పోషకాహార సరఫరాలో అంతరాయం లేకుండా సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు కేవలం రికార్డులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు ఫలితాలు అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలనే దిశగా కలెక్టర్ తనిఖీలు కొనసాగించారు. ఈ పర్యటనలో గ్రామ సర్పంచ్ కవిత, ఉప సర్పంచ్ ఆంజనేయులు, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్, జి.పి.ఓ రమేష్, వార్డు సభ్యులు సుమలత, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌పై ఆకతాయి విధ్వంసం.!

- 'మన మహబూబ్‌నగర్' సైన్‌బోర్డుల ధ్వంసం..

సీసీ కెమెరాల్లో నిందితుడి కదలికలు

- మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదుతో కేసు నమోదు..

బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరిక

మహబూబ్‌నగర్, నవంబర్ 4 (ప్రజా జ్యోతి బ్యూరో):

పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన మినీ ట్యాంక్‌బండ్‌పై ఆకతాయిల విధ్వంసం కలకలం రేపింది. ఇటీవలే ప్రారంభించిన 'మన మహబూబ్‌నగర్' సైన్‌బోర్డుతో పాటు అక్కడ ఏర్పాటు చేసిన ఇతర సైన్‌బోర్డులను గుర్తుతెలియని వ్యక్తి ధ్వంసం చేయడం చర్చనీయాంశంగా మారింది. బుధవారం తెల్లవారుజామున మినీ ట్యాంక్‌బండ్‌పై ఉన్న పార్కు ప్రాంతంలోకి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తి సైన్‌బోర్డులను ధ్వంసం చేస్తూ హల్‌చల్ చేసినట్లు సమాచారం. ఈ ఘటన అక్కడ ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల్లో రికార్డయింది. ఈ ఘటనపై స్పందించిన నగరపాలక సంస్థ కమిషనర్ రామానుజుల రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజాధనంతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ ఫిర్యాదు మేరకు మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మినీ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తూ విధ్వంసానికి పాల్పడిన వ్యక్తిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కులు, సైన్‌బోర్డులు, ఇతర ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం బాధ్యతారాహిత్యమని అధికారులు పేర్కొన్నారు. ప్రజాధనంతో నిర్మించిన ఆస్తులను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఇలాంటి విధ్వంసక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రజా ఆస్తులు ఎవరి సొత్తు కాదు.. అవి ప్రజలందరి సంపద. వాటిని ధ్వంసం చేసేవారికి చట్టమే సమాధానం చెప్పాలి.

బునియాదిపురంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి భూమిపూజ.

- మహిళా సంఘాల అభివృద్ధికి మరో ముందడుగు

సర్పంచ్ విజయ్ గౌడ్.

పెబ్బేరు నవంబర్04 ప్రజాజ్యోతి

పెబ్బేరు మండలం బునియాదిపురం గ్రామంలో మహిళా సంఘాల అభివృద్ధి, మహిళల ఐక్యతకు వేదికగా నిలవనున్న మహిళా సమైక్య భవన నిర్మాణానికి బుధవారం ఘనంగా భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వజగౌని విజయ్ గౌడ్, ఉపసర్పంచ్ శెటమోని చంద్రకళ, ఎంపీడీవో వెంకటేష్, ఎంపీఓ రోజా, ఏపీఓ నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కర్ణాకర్ రెడ్డి, టీఏ యాదగిరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వజగౌని విజయ్ గౌడ్, ఎంపీడీవో వెంకటేష్ కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించారు. మహిళా సంఘాలకు ప్రత్యేక భవనం ఏర్పాటు కావడం ద్వారా మహిళా సంఘాల సమావేశాలు, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు, మహిళల సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘం లీడర్స్ విజయలక్ష్మి, రాణి, జ్యోతి, భాగ్యమ్మతో పాటు వార్డు సభ్యులు సహదేవుడు, రమేష్, సత్యం, అలీమా, మాబు, పెబ్బేరు మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వనం రాములు, మాజీ సర్పంచ్ వెంకటేష్, మాజీ డైరెక్టర్ ఆంజనేయులు, శెటమోని బాలరాజు గ్రామ పెద్దలు పెద్ద రాముడు, బాలకిష్టి, శ్యాంసుందర్, అంజన్న, బసవరాజ, చిన్న రాముడు, ఏసన్న, బాలకురుమూర్తి, పాశం శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.అలాగే గ్రామ మహిళలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు.. మెరుగైన ఉపాధి అవకాశాలే లక్ష్యం

బెంగళూరు స్కిల్ సమ్మిట్--2026లో తెలంగాణ తరఫున పాల్గొన్న

టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

AI, ఇండస్ట్రీ 4.0 వంటి భవిష్యత్ రంగాల్లో యువతకు శిక్షణ అందిస్తాం -- రాఘవేందర్ రెడ్డి





కల్వకుర్తి, నవంబర్ 4 (ప్రజా జ్యోతి):

తెలంగాణ రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను అందించి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్ నిరంతరం కృషి చేస్తోందని టాస్క్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక బెంగళూరు స్కిల్ సమ్మిట్--2026లో ఆయన పాల్గొన్నారు.ఈ జాతీయ స్థాయి సదస్సులో టాస్క్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి భాగస్వామిగా పాల్గొనగా, టాస్క్ సీఈఓ నితిన్ కుమార్ రెడ్డితో కలిసి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించారు.ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత కేవలం విద్యార్హతలకే పరిమితం కాకుండా పరిశ్రమలకు అవసరమైన ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఖఱ), ఇండస్ట్రీ 4.0, డీప్ టెక్నాలజీ, గ్రీన్ జాబ్స్ వంటి భవిష్యత్ రంగాల్లో శిక్షణ పొందితే యువతకు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం పెరగాలని, కంపెనీల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు రూపొందించాలని పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్లేస్‌మెంట్ ఆధారిత కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.బెంగళూరు స్కిల్ సమ్మిట్ వంటి అంతర్జాతీయ వేదికలు ప్రముఖ కార్పొరేట్ సంస్థలు, వివిధ రాష్ట్రాలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలతో భాగస్వామ్యాలు పెంపొందించుకోవడానికి దోహద పడతాయని చెప్పారు. ఇక్కడ తెలుసుకున్న ఆధునిక శిక్షణ విధానాలు, నూతన ఆలోచనలను తెలంగాణలో అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువతకు సైతం ఆధునిక సాంకేతిక శిక్షణ అందుబాటులోకి తీసుకొచ్చి, ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే టాస్క్ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ సహకారం, పరిశ్రమల భాగస్వామ్యం, విద్యాసంస్థల సమన్వయంతో తెలంగాణ యువతను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని రాఘవేందర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో టాస్క్ సీఈఓ నితిన్ కుమార్ రెడ్డి, సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డితో పాటు పలువురు టాస్క్ ప్రతినిధులు పాల్గొన్నారు.సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డితో పాటు పలువురు టాస్క్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్చాల గ్రామంలో ఫామ్ పాండ్స్‌పై రైతులకు అవగాహన

వర్షపు నీటిని ఒడిసిపట్టి వ్యవసాయానికి వినియోగించుకోవాలిజిల్లా

వ్యవసాయ అధికారి ఉష్మంత్ రావు



కల్వకుర్తి, నవంబర్ 4 (ప్రజా జ్యోతి):

రైతులకు నీటి సంరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు వ్యవసాయంలో నీటి వినియోగాన్ని సమర్థవంతంగా పెంపొందించాలనే లక్ష్యంతో మార్చాల గ్రామంలో ఫామ్ పాండ్స్ (వ్యవసాయ కుంటలు) నిర్మాణం, వాటి ఉపయోగాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ.. ఫామ్ పాండ్స్ నిర్మాణం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకొని అవసరమైన సమయంలో పంటలకు సాగునీటిగా వినియోగించుకోవచ్చని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటలను కాపాడుకోవడానికి వ్యవసాయ కుంటలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ప్రతి రైతు నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఫామ్ పాండ్స్ నిర్మాణంపై ఆసక్తి చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి వ్యవసాయ సహాయ సంచాలకులు కె. మంజుల, మండల వ్యవసాయ అధికారి ఎస్. సురేష్, వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ బి. వెంకటేష్, గ్రామ సర్పంచ్ కృష్ణ రెడ్డి,వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, రైతులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సమస్యలు పరిష్కరించాలి

నవంబర్ 6న హైదరాబాద్‌లో జరిగే ధర్నాను విజయవంతం చేయాలి.

పెబ్బేరు నవంబర్04 ప్రజాజ్యోతి

తెలంగాణ వ్యవసాయ సహాయ కార్యదర్శి ఆర్ దేవన్న జిల్లా ఉపాధ్యక్షులు మహా బూబ్ పాషాపెబ్బేరు మండలంలోని చెలిమీల గ్రామంలో ధర్నాకు సంబందించిన కరపత్రాలు విడుదల చేసిన అనంతరం మాట్లాడుతూ మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోనూ ఉపాధి హామీ పనులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో నవంబర్ 6న హైదరాబాద్‌లోని కమిషనరేట్ సీఆర్‌డీ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనమైన గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ వి.బి.-జి. రామ్‌జీ పథకం కింద ఉపాధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలు, వ్యవసాయ కూలీలకు కూడా ఉపాధి హామీ పనులు కల్పించాలని, ఏడాదికి 200 రోజుల పని, రోజుకు రూ.800 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు పండక గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ ప్రజలు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పేదలు, కూలీలను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఉపాధి పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. కొత్త జాబ్ కార్డుల జారితో పాటు 18యేండ్లు నిండిన వారి పేర్లుకూడా నమోదుకు అవకాశం కల్పించాలని డీమాండ్ చేశారు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పట్టణ ప్రాంతాల్లోనూ ఏడాదికి 100 రోజుల ఉపాధి, రోజుకు రూ.400 కూలి కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిన ప్రాంతాల్లో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం వెంటనే చెల్లించాలని కోరారు.నవంబర్ 6న హైదరాబాద్‌లోని కమిషనరేట్ సీఆర్‌డీ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు వనపర్తి జిల్లాలోని మున్సిపాలిటీల ప్రజలు, మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల ప్రజలు,. గ్రామీణ ఉపాధి కూలీలు మెట్ లు వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో



తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఖాసీమ్, రాధమ్మ, చంద్రమ్మ, సుంకలమ్మ, శ్రీదేవి, పెద్దయ్య, భోజమ్మ, పొగన్న తదితరులు పాల్గొన్నారు.

రంగాపురం గ్రామంలో వరుస దొంగతనాలు...!

మొన్న రెండు ఇళ్లలో చోరీ...!

నిన్న రాత్రి తొమ్మిది ఇళ్లలో దొంగల హల్‌చల్..!

రంగంలోకి దిగిన పోలీసులు.

పెబ్బేరు నవంబర్04 ప్రజాజ్యోతి

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. గ్రామంలోని సుమారు తొమ్మిది ఇళ్లలో దొంగలు చొరబడి వస్తువులను చిందరవందర చేసినట్లు సమాచారం. అయితే చిన్నచిన్న వస్తువులు మినహా పెద్ద మొత్తంలో నగదు, విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు ప్రాథమికంగా తెలియరాలేదు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న సీఐ ఓడీ రమేష్, పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ గ్రామానికి చేరుకుని క్లూస్ టీమ్‌తో కలిసి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. దొంగతనాలకు సంబంధించిన ఆధారాలను సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఒకేసారి తొమ్మిది ఇళ్లలో దొంగలు ప్రవేశించడంతో గ్రామ ప్రజల్లో ఆందోళన నెలకొంది.ఈ సందర్భంగా సీఐ ఓడీ రమేష్, ఎస్ఐ వెంకటేష్ గౌడ్ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, విలువైన వస్తువులు, నగదును భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఇంత జరుగుతున్నా పట్టించుకునేది ఎవరు..?

గ్రామంలో తొమ్మిది ఇళ్లలో దొంగలు చొరబడి ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నప్పటికీ గ్రామ సర్పంచ్ నుంచి ఎలాంటి స్పందన లేదంటూ స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ



ప్రజల భద్రత, రక్షణ విషయంలో గ్రామ నాయకత్వం బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా గ్రామంలో భద్రతా చర్యలు చేపట్టి, రాత్రివేళల్లో నిఘా పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కానీ గ్రామ సర్పంచ్ ఏం చేస్తున్నారు?

ఇంత జరుగుతున్న పట్టించుకునేది ఎవరు...?

రంగాపురం గ్రామంలో మొన్నటికి మొన్న రెండు ఇళ్లలో చోరీ, నిన్న



రాత్రి ఏకంగా తొమ్మిది ఇళ్లలో దొంగలు చొరబడి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నప్పటికీ గ్రామ సర్పంచ్ నుంచి ఎలాంటి స్పందన లేదంటూ స్థానికంగా ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. గ్రామ ప్రజల భద్రత ప్రవచన విషయంలో గ్రామ నాయకత్వం బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.గ్రామంలో ఇంత పెద్ద ఘటన జరిగినా గ్రామ సర్పంచ్ నుంచి ఎలాంటి స్పందన లేదు. బాధిత కుటుంబాలను పరామర్శించలేదు. గ్రామంలో నిఘా పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.రాత్రి వేళల్లో కాపలా, సీసీ కెమెరాలు ఉన్నా అవి పని చేయడం లేదు.వాటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు అంటూ గ్రామస్తులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి.. ఏఎస్ఐలుగా కొత్త బాధ్యతలు!

- పోలీస్ సిబ్బందిలో నూతనోత్సాహం నింపిన ప్రమోషన్లు

- పదోన్నతి చిహ్నాలు అందజేసి అభినందించిన జిల్లా ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, నవంబర్ 4 (ప్రజా జ్యోతి బ్యూరో):

పోలీస్ శాఖలో క్రమశిక్షణ, అంకితభావం, నిబద్ధతతో విధులు నిర్వహించే సిబ్బందికి పదోన్నతులు మరింత బాధ్యతతో ప్రజాసేవ చేసే అవకాశాన్ని కల్పిస్తాయని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా (ఏఎస్ఐ) పదోన్నతి పొందిన సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో వారికి పదోన్నతి చిహ్నాలను అందజేసి అభినందించారు.పదోన్నతి పొందిన వారిలో డీఎస్పీ కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ 1540 విజయ్ కుమార్ ఏఎస్ఐగా పదోన్నతి పొంది వనపర్తి జిల్లాకు బదిలీ కాగా, మహిళా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎం.ఏ. రషీద్ (హెచ్ సీ 1613) ఏఎస్ఐగా పదోన్నతి పొంది నారాయణపేట జిల్లాకు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో పదోన్నతి అనేది కేవలం హోదాలో మార్పు మాత్రమే కాదని, ప్రజలకు మరింత



బాధ్యతాయుతంగా సేవలందించే గొప్ప అవకాశమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీతో పనిచేస్తూ



పదోన్నతులు సాధించడం అభినందనీయమన్నారు.నూతన హోదాలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, బదిలీ అయిన జిల్లాల్లోనూ ప్రజల మన్ననలు పొందాలని, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం పదోన్నతి పొందిన ఇద్దరు ఏఎస్ఐలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి భవిష్యత్ పోలీస్ సేవలు విజయవంతంగా కొనసాగాలని ఎస్పీ ఆకాంక్షించారు.

పోలీసుల దర్యాప్తు.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ల వాదన.. నేరస్తులకు శిక్ష పడేలా సమన్వయం!

– కేసుల దర్యాప్తు నుంచి కోర్టు తీర్పుల వరకు సమిష్టి కృషి అవసరం

– మహిళలు, చిన్నారులపై నేరాలు.. పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి: జిల్లా ఎస్పీ జానకి



మహబూబ్‌నగర్, నవంబర్ 4 (ప్రజా జ్యోతి బ్యూరో):

నేరాలకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టి, న్యాయస్థానాల్లో తగిన శిక్షలు పడేలా చేయడంలో పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల మధ్య సమన్వయం అత్యంత కీలకమని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి పేర్కొన్నారు. కేసుల దర్యాప్తు నుంచి సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్ల దాఖలు, కోర్టు విచారణ వరకు సమిష్టి కృషితో ముందుకు సాగాలని సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ అధికారులతో ఎస్పీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కేసుల దర్యాప్తు తీరు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జిషీట్ల దాఖలు, న్యాయస్థానాల్లో కేసుల విచారణ పురోగతిపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేరస్తులకు న్యాయస్థానాల్లో శిక్షలు పడే శాతాన్ని పెంచడంలో పోలీస్ శాఖతో పాటు ప్రాసిక్యూషన్ విభాగం పాత్ర కూడా కీలకమని స్పష్టం చేశారు. దర్యాప్తు ప్రారంభ దశ నుంచే పబ్లిక్



ప్రాసిక్యూటర్ల సలహాలు, సూచనలు తీసుకుంటే కేసుల్లో సాంకేతిక, చట్టపరమైన లోపాలను నివారించి పకడ్బందీగా ఆధారాలు సేకరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు కేసుల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ, అవసరమైన సమాచారాన్ని పరస్పరం పంచుకుంటూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, పోక్సో కేసులు, తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా పక్కా సాక్ష్యాధారాలను న్యాయస్థానాల ముందు సమర్పించాలని పేర్కొన్నారు.కోర్టు విచారణ సమయంలో సాక్షుల హాజరు, సాక్ష్యాధారాల సమర్పణ, కేసుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. సమన్వయ లోపాలకు తావులేకుండా పనిచేస్తే కేసుల విచారణ మరింత సమర్థవంతంగా సాగుతుందని



పేర్కొన్నారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సేవలను అభినందించిన జిల్లా ఎస్పీ వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖ, ప్రాసిక్యూషన్ విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ కిరణ్ కుమార్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుదర్శన్ రెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి, వర్టికల్ డీఎస్పీ బాలాజీ, ఇతర పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు , పోలీస్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రాఘువేంద్ర రాజుపై కార్పొరేటర్ రామస్వామి ఫైర్.!

- చిల్లర రాజకీయాలు మానుకోవాలి.. ఎమ్మెల్యే దృష్టి పెడితే బయట తిరగగలవా.?

- రెండు ఓట్ల వివాదంపై కాంగ్రెస్ లీగల్ సెల్ నేత గడల రాజేశ్ కీలక వ్యాఖ్యలు

- ఒక్క ఓటు కాదు.. పది ఓట్లు ఉన్నా ఒక్కటే వినియోగిస్తే తప్పేంటి.? అంటూ సమర్థింపు

మహబూబ్‌నగర్, నవంబర్ 04 ప్రజాజ్యోతి బ్యూరో):

మహబూబ్‌నగర్ రాజకీయాల్లో రెండు ఓట్ల వివాదం మరోసారి వేడెక్కింది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డికి రెండు ఓట్లు ఉన్నాయంటూ ఆరోపణలు చేస్తూ, ఈ అంశంపై పాదయాత్ర చేపట్టిన చలువగాలి రాఘవేంద్ర రాజును లక్ష్యంగా చేసుకుని కార్పొరేటర్ రామస్వామి ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాఘవేంద్ర రాజు చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలుకుతూ, ఎమ్మెల్యే దృష్టి పెడితే బయట తిరగగలవా? అంటూ ప్రశ్నించారు. బుధవారం మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ రామస్వామి ఈ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఇప్పటికే రాజకీయంగా చర్చనీయాంశమైన రెండు ఓట్ల వివాదం మరింత ఆసక్తికరంగా మారింది.

ఒక్క ఓటు కాదు.. పది ఓట్లు ఉండొచ్చు..!

ఇదే సమావేశంలో డీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్, సుప్రీంకోర్టులో ఎన్‌రోల్ అయిన న్యాయవాది గడల రాజేశ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా, ఉన్నత విద్యావంతుడిగా ఉన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిపై రెండు ఓట్లు ఉన్నాయంటూ రాఘవేంద్ర రాజు ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఒక వ్యక్తికి రెండు ఓట్లు లేదా పది ఓట్లు ఉన్నప్పటికీ, అందులో ఒక్క ఓటు మాత్రమే వినియోగిస్తే తప్పేమిటని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే రెండు ఓట్లు ఉన్నప్పటికీ ఒక్క ఓటునే వినియోగించారని, తన ఓటు తాను వేసుకుని



గెలిచారని సమర్థించారు. ఈ వ్యవహారంలో ఏవైనా తప్పులు ఉన్నాయని భావిస్తే ఎన్నికల సంఘమే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.రెండు ఓట్ల వివాదంపై రాజకీయ వాదోపవాదాలు ఇలా కొనసాగుతుండగా, ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలనే ఎన్నికల నిబంధనలపై చట్టపరమైన స్పష్టత, అధికారిక విచారణే ఈ వివాదానికి కీలక పరిష్కారంగా నిలవనున్నాయి. మొత్తానికి ప్రెస్ క్లబ్ వేదికగా వెలువడిన ఈ వ్యాఖ్యలు పాలమూరు రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధానికి తెరలేపాయి. అటు రాఘవేంద్ర రాజు, ఇటు కాంగ్రెస్ నేతల వాదనల మధ్య ఈ వివాదం ఎలాంటి మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

ముందలి తాండా లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ...

మహమ్మదాబాద్ నవంబర్ 4(ప్రజా జ్యోతి)

మహమ్మదాబాద్ మండలం లోని ముందలి తండా లో గ్రామ సర్పంచ్ అంజ్యా నాయక్ ఆధ్వర్యంలో 200 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తామని తెలిపారు.

